ఎండిన పంట.. జీవాలకు మేత



యాసంగిలో వరి సాగుచేస్తున్న రైతులకు నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నీరందక పంట ఎండిపోతున్నది. మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం చండూర్ శివారులో రైతు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి రెండు ఎకరాల్లో వరి సాగు చేశాడు. బోరు ఎండిపోయింది. గింజ గట్టిపడే దశలో నీరు అందకపోవడంతో చేసేదేమీ లేక వరిపంటను వదిలేశాడు. దీంతో ఎండిపోయిన వరి పంట గొర్రెలు, మేకలకు మేతగా మారింది. – చిలిపిచెడ్

కరెంట్ లోవోల్టేజీపై రైతుల ధర్నా

లోవోల్టేజీ సమస్య తలెత్తకుండా నాణ్యమైన కరెంట్‌ను అందించాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళనకు దిగారు. మంగళవారం వనపర్తి జిల్లా నాచహల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద నాచహల్లి, సవాయిగూడెం, పెద్దగూడెం, పెద్దగూడెం తండాకు చెందిన రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగి వరికి త్రీఫేజ్ కరెంట్ సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులకు విన్నవించినా పరిస్థితి మెరుగుపడలేదని వాపోయారు. పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వంలో కరెంట్ సమస్యలు లేవని.. కానీ కాంగ్రెస్ వచ్చినప్పటి నుంచి విద్యుత్తు సమస్యలు మొదలైనట్టు చెప్పారు. మరో 20 రోజులు మెరుగైన విద్యుత్తును సరఫరా చేస్తేనే పంటలు చేతికొస్తాయని చెప్పారు. వీరి నిరసనకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం గుమ్మడం సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం రైతులు ఆందోళనకు దిగారు. మూడ్రోజుల పాటు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో నీళ్లు అందక పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. –వనపర్తి, పెబ్బేరు

మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం నాయినోనిపల్లి శివారులో పంట నష్టపోయిన రైతుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

రైతుల జీవితాలతో రేవంత్ చెలగాటం

- అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- అసెంబ్లీలో కాదు.. క్షేత్రస్థాయికి రావాలి : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- హన్వాడ మండలంలో దెబ్బతిన్న పంటల పరిశీలన

మహబూబ్‌నగర్, మార్చి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమై రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం నాయినోనిపల్లి గ్రామ శివారులో ఇటీవల అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఏ ఒక్క హామీ అయినా నెరవేర్చి ఉంటే రైతులకు ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని అన్నారు. రైతులకు రుణమాఫీ అయిందని అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రులు క్షేత్రస్థాయిలోకి వస్తే వాస్తవాలు తెలుస్తాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే మరో రైతు పోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. వడగండ్ల వానతో పంటలు పూర్తిగా దెబ్బతింటే కనీసం జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి కానీ.. మంత్రులైనా పట్టించుకున్నారా? అని నిలదీశారు. దెబ్బతిన్న పంటలకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కామారెడ్డి జిల్లా రాజంపేట, తలమడ్లలో సాగునీరందక నెర్రెలు బారిన వరి పొలం

అడుగంటిన బోర్లు.. ఎండిన పొలాలు

కామారెడ్డి జిల్లా రాజంపేట, తలమడ్ల గ్రామాల రైతుల ఆందోళన

రాజంపేట్, మార్చి 25: యాసంగి సాగులో రైతులను నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటిపోతుండటంతో బోర్లు వట్టిపోతున్నాయి. దీంతో నీరందక పంటలు ఎండిపోతున్నాయి. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలంలోని రాజంపేట, తలమడ్ల గ్రామాల్లో పొట్ట దశలో ఉన్న పంటలు నీరు అందక నెర్రెలు బారుతున్నాయి. కొందరు కొత్తగా అప్పులు చేసి బోర్లు వేసినా చుక్కనీరు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

రెండు బోర్లు వేసినా చుక్కనీరు పడలే..

రెండెకరాల్లో మక్క వేసిన. ఇప్పుడు బోర్లు ఎత్తిపోవడంతో పంట ఎండిపోతున్నది. రూ.లక్ష అప్పు చేసి రెండు బోర్లు వేయించగా.. అవి ఫెయిలయ్యాయి. సగం పంట ఎండిపోవడంతోపాటు అప్పుల పాలైన. –మొకద్దం అశోక్, తలమడ్ల

పంట ఎండిపాయె.. అప్పు ఎట్ల తీర్చుడో?

ఐదెకరాల్లో వరి సాగుచేస్తుండగా బోర్లలో ధార తగ్గిపోయింది. పంటలకు నీరందడంలేదు. చుట్టూ ఉన్న చెరువులు, కుంటల్లో నీళ్లు ఉంటే బోర్లు ఎత్తిపోయేవికాదు. నీరందక పంట ఎండిపోతున్నది. –కట్లెకుంట్ల భూమయ్య, రాజంపేట

అగ్రహారంలో అడుగంటిన బావి

ఆందోళనలో రైతు దేవయ్య

ఎల్లారెడ్డిపేట, మార్చి 25: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారంలో రైతు పొన్నవేణి దేవయ్య బావి అడుగంటింది. కామారెడ్డి–కరీంనగర్ ప్రధాన రహదారికి ఆనుకుని రెండున్నర ఎకరాల భూమి ఉండగా, పన్నెండేళ్ల కింద కరువు పరిస్థితుల్లో రూ.5 లక్షలు పెట్టి 20 గజాల బావి తవ్వించాడు. అందులోనే బోరు వేయించి ఇన్నాళ్లు సాగు చేస్తూ వస్తున్నాడు. ఎప్పుడు చూసినా ఏడు గజాల మేర నీళ్లుండగా, సాగు నీటి రంది లేకుండా సంతోషంగా గడిపాడు. కానీ, ఈ ఏడాది గజం నీళ్లు కూడా లేకుండా పోవడంతో ఆగమైపోయాడు. ఇప్పటికే పంట పెట్టుబడికి రూ.70వేల దాకా ఖర్చు చేశాడు. చివరి దశలో పంటను కాపాడుకునేందుకు ఇటీవలే రూ.26వేలు పెట్టి బావిలో పూడిక తీయించాడు. అయినా నీళ్లు ఎల్లుతయో లేదోనని ఆందోళన చెందుతున్నాడు. పదేండ్ల సంది కరువన్నదే లేదని, ఈ ఏడు సాగునీటికి గోసపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇంక పదిహేను రోజులు నీళ్లందితేనే పంట ఉంటదని, లేకుంటే ఇబ్బందేనని వాపోయాడు.

అగ్రహారంలో ఎండిపోయిన వ్యవసాయ బావి

బయ్యారం మండలం నామాలపాడులో తడిసిన మక్కను చూపుతున్న రైతు

అకాల వర్షంతో రైతుకు తీరని నష్టం

బయ్యారం ఏజెన్సీలో తడిసిన మక్క, నేలరాలిన మామిడి

బయ్యారం, మార్చి 25 : మహబూబాబాద్ జిల్లా బయ్యారం ఏజెన్సీ గ్రామాల్లో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షం రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. మండలంలోని కంబాలపల్లి, సుద్దరేవు, కొత్తగూడెం, కస్తూరినగర్, లింగగిరి, కొత్తపేట, గంధంపల్లి, నామాలపాడు, కోటగడ్డ, ఇర్సులాపురం తదితర ఏజెన్సీ గ్రామాల్లో యాసంగిలో మక్క పంట అధికంగా సాగు చేశారు. కొన్నిచోట్ల పంట చేతికంది కల్లాల్లో ఆరబెట్టగా, మరికొన్ని చోట్ల మరో పది రోజుల్లో పంట చేతికొస్తుండగా అకాల వర్షంతో కల్లాల్లోని మక్క తడిసిపోయింది. చేనులో ఉన్న పంట నేలకొరిగింది. దీంతో అష్టకష్టాలు పడి పంట సాగు చేస్తే చేతికొచ్చే సమయంలో నష్టం వాటిల్లడంతో గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు. అదేవిధంగా కొత్తపేట, నామాలపాడు , గంధంపల్లి, సంత్రాల పోడ్ తండాలో ఇటుక బట్టీలోని ఇటుకలు తడిసిపోయాయి. ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలాయి. బీరోని మడనిమడవ, పందిపంపుల గ్రామాల్లో నేలకొరిగిన మక్క పంటను మండల వ్యవసాయ శాఖ అధికారి రాంజీ నాయక్, ఏఈవో శిరీష పరిశీలించారు.

- చి'వరి'కి అందని కడెం నీరు

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొనకల్ గ్రామంలో కడెం కాలువ నీరు చివరి ఆయకట్టు వరకూ అందక వరిచేను ఎండిపోయింది. కడెం ప్రాజెక్టు 13 డిస్ట్రిబ్యూటరీ కాలువ నీరు అందుతుందనే ఆశతో రైతులు సాగుచేయగా, కడెం కాలువ నీరుఅందక దాదాపు 20 గుంటల్లో వరి చేను ఎండిపోయింది. – జన్నారం

- నీళ్లులేక పశువులకు మేతగా..

నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం గున్ముక్ల శివారులో రైతు పులిమామిడిపేట తిమ్మయ్య సాగుచేసిన రెండెకరాల్లో వరి ఎండిపోయింది. బోరులో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోవడంతో నీళ్లు అందక పంట ఎండుముఖం పట్టింది. చేసేదేమీలేక మంగళవారం పంటను పశువులకు వదిలేశాడు. రెండెకరాల పంట ఎండిపోవడంతో రూ.లక్ష వరకు నష్టపోయినట్టు తిమ్మయ్య వాపోయాడు. – ధన్వాడ

- ఇంకిన వాగు.. ఎండిన సాగు

భద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండల రైతులు సాగునీరు లేక అల్లాడిపోతున్నారు. ఎదుళ్లవాగులో నీళ్లు ఇంకిపోవడంతో కండ్లముందే ఎండిపోతున్న పంటలను చూసి మండలంలోని తుంగారం, రేపల్లెవాడ, సత్యనారాయణపురం, గానుగపాడు, తిప్పనపల్లి, సీతాయిగూడెం తదితర గ్రామాల రైతులు తల్లడిల్లుతున్నారు. ఎదుళ్లవాగులోని కొద్దిపాటి ఊట నీటిని తోడేందుకే ఓ రైతు ఇలా మోటర్ బిగించాడు. – చంద్రుగొండ

జడ్చర్ల కోర్టులో విధులు బహిష్కరించి నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

హైదరాబాద్/మహబూబ్‌నగర్/జడ్చర్ల టౌన్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాది ఇజ్రాయిల్ హత్యను నిరసిస్తూ మంగళవారం హైకోర్టుతోపాటు రాష్ట్రంలోని పలు జిల్లా కోర్టుల్లో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు న్యాయవాదులు కేసుల విచారణకు హాజరు కాలేదు. దీంతో వారి కేసులపై న్యాయమూర్తులు ఎలాంటి వ్యతిరేక ఉత్తర్వులు ఇవ్వకుండా వాయిదా వేశారు. అంతకుముందు హైకోర్టు 6వ గేటు నుంచి 4వ గేటు వరకు లాయర్లు ర్యాలీ నిర్వహించి, బైఠాయించారు. హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ నరసింహారెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్ ఇజ్రాయిల్ హత్యను ఖండించారు. అలాగే మహబూబ్‌నగర్, జడ్చర్లలో లాయర్లు విధులను బహిష్కరించారు. మహబూబ్‌నగర్ కోర్టు ప్రాంగణం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

వీవోఏల మెరుపు సమ్మె

సమస్తే నెట్‌వర్క్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని వీవోఏలు (గ్రామ సంఘ సహాయకులు) ఆందోళన బాటపట్టారు. మంగళవారం రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన వందలాదిమంది మాసబ్‌ట్యాంక్‌లోని సెర్ప్ ఆఫీసు వద్ద మెరుపు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతినెలా రూ. 20 వేల చొప్పున వేతనం ఇవ్వాలని, స్త్రీనిధి ఇన్సెంటివ్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా, సెర్ప్ కార్యాలయం వద్ద మెరుపు సమ్మెకు దిగిన వీవోఏలను పోలీసులు అడ్డుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. అనంతరం పోలీసులు అక్కడ నుంచి వారిని వ్యాన్లల్లో తరలించారు. ఇదిలా ఉండగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్‌కు పిలుపునివ్వగా జీపీ కార్మికులు, వీవోఏలు హైదరాబాద్‌కు వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలి

జేఏసీ రాష్ట్ర చైర్మన్ కే ఈశ్వర్‌రావు డిమాండ్

కవాడిగూడ, మార్చి 25: విద్యుత్తు సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని తెలంగాణ విద్యుత్తు ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కే ఈశ్వర్ రావు, రాష్ట్ర కన్వీనర్ ఎంఏ వజీర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏడేండ్లుగా 20వేల మంది ఆర్టిజన్స్ పనిచేస్తున్నారని, వీరు అంతకుముందు విద్యుత్ సంస్థల్లోనే కాంట్రాక్ట్ పద్ధతిలోనే పనిచేశారని తెలిపారు. వీరి విద్యార్హతను బట్టి కన్వర్షన్ చేయాలని కోరారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికుల కన్వర్షన్‌పై అసెంబ్లీ సమావేశాల్లోనే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు పాలడుగు భాస్కర్, జే వెంకటేశ్‌లు ఆర్టిజన్స్‌కు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో చైర్మన్లు జీ నాగరాజు, వీ నరేందర్, కో కన్వీనర్లు వెంకటేశ్, కృష్ణమాచారి, నాయకులు చంద్రారెడ్డి, లింగం, మురళి, రఘునాథ్‌రెడ్డి, సదానందం, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యంఎ.వజీర్

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

కవాడిగూడ, మార్చి 25: పంచాయతీ కార్మికుల మెడకు ఉరితాడుగా మారిన మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు పాలడుగు భాస్కర్, రాష్ట్ర అధ్యక్షుడు జీ పాండు డిమాండ్ చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమంలో (సీఐటీయూ) ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు మంగళవారం ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బంది వేతనాలకు బడ్జెట్ కేటాయించి.. గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని అన్నారు. పంచాయతీ సిబ్బందిని కూడా రెండో పీఆర్‌సీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. జీవోనంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన సిబ్బందికి ప్రమోషన్స్ కల్పించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో పేర్కొన్న హామీలు అమలు చేయాలని అన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు సు ధాకర్, గణపతిరెడ్డి, యాదయ్య, వెంకటయ్య, మహేశ్, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా పార్కు వద్ద ధర్నాలో నినదిస్తున్న యూనియన్ నాయకులు

పెద్దపల్లి జిల్లా రామగుండం బల్దియా కార్యాలయాన్ని ముట్టడించిన సీపీఎం నాయకులు

ఆరు గ్యారెంటీలు అడిగితే అరెస్టు చేస్తరా?

- 15 నెలలైనా ఎందుకు అమలు చేయడం లేదు?
- ఇప్పటికైనా సంపూర్ణంగా అమలు చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

కోల్‌సిటీ/కూసుమంచి (నేలకొండపల్లి), మార్చి 25: ఆరు గ్యారెంటీలను అమలు చేయమని అడిగితే అరెస్టులు చేస్తరా? అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఇంకా ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. మంగళవారం ఆయన గోదావరిఖని చేరుకున్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని, పట్టణ సమస్యలు తీర్చాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో రామగుండం మున్సిపల్ కార్యాలయం ఎదుట మహాధర్నా చేపట్టారు. అంతకుముందు జాన్‌వెస్లీకి ఎన్టీపీసీ వద్ద ఘన స్వాగతం పలికారు. బైక్ ర్యాలీగా గోదావరిఖనికి చేరుకొని అంబేద్కర్, మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ధర్నాలో ఆయన మాట్లాడారు. భూపోరాటం ద్వారా ఇండ్లు నిర్మించుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు తమ ఉద్యోగ భద్రత కోసం ఉద్యమిస్తుంటే, అక్రమంగా అరెస్టులు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేశ్, జిల్లా నాయకుడు ఎర్రా శ్రీనివాసరావు, మండల కార్యదర్శి కేవీ రాంరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గుడవర్తి నాగేశ్వరరావు, ఎస్‌కే బషీర్, రచ్చా నర్సింహారావు, బెల్లం లక్ష్మి, నాగేశ్వరరావు, దండా సూర్యనారాయణ, బలుపు ప్రమీల, కొండల్‌రావు, కనమయ్య పాల్గొన్నారు.